## ఖోఖో పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



విజేత జట్టుకు క్రీడాకారులకు బహుమతి అందిస్తున్న అధికారులు

జగిత్యాల, డిసెంబర్ 16 : విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం వారు ఖోఖో పోటీలు నిర్వహించారు. మహిళల ఖోఖో క్రీడా పోటీల్లో జగిత్యాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల కళాశాల విద్యార్థినుల ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారిణులకు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి బహుమతుల ప్రదానం చేశారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారిణులు సౌత్ జోన్ స్థాయిలో ఈ నెల 26 నుంచి 30 వరకు తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీలో జరిగే ఖోఖో క్రీడా పోటీల్లో శాతవాహన విశ్వావిద్యాలయం తరపున పాల్గొంటారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ హరీరామ్ లావుడ్యా తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ గోలి శ్రీలత , వైస్ ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు క్రీడాకారిణులను అభినందించారు.

## 18 నుంచి సాగు నీటి విడుదల

జగిత్యాల టౌన్, డిసెంబర్ 16: కాకతీయ కాలువ పరిధిలోని ఆయకట్టు రైతులకు యాసంగి పంట కోసం ఈ నెల 18 నుంచి సాగు నీటిని విడుదల చేయనున్నట్లు శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జీ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి ఏడు రోజులు డిస్ట్రిబ్యూటరీ 53 (జోన్-1) ఆయకట్టు పరిధి వరకు తర్వాత ఎనిమిది రోజులు డీ 53 కింద (జోన్-2) ఆయకట్టుకు ఆన్ ఆఫ్ పద్ధతిలో సాగునీరు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులో గతేడాది కంటే నీటి సామర్థ్యం తక్కువగా ఉన్నందున ఆయకట్టు రైతులు నీటిని పొదుపుగా వాడుకొని నీటిపారుదల శాఖకు సహకరించాలని కోరారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



లోక్ అదాలత్ సన్నాహక సదస్సులో న్యాయమూర్తి, పోలీసు అధికారులు

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 16: ఈ నెల 30న నిర్వహించే లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టీ శ్రీనివాస్ సూచించారు. శనివారం గోదావరిఖని అదనపు జిల్లా న్యాయస్థానంలో లోక్‌అదాలత్ సన్నాహక సదస్సుకు న్యాయమూర్తి హాజరై మాట్లాడారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరుగుతూ, డబ్బు వృథా చేసుకోవద్దన్నారు. ఇక్కడ గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జిలు జీ వెంకటేశ్, దుర్గం గణేశ్, ఏసీపీ తుల శ్రీనివాస్‌రావు, టూ టౌన్, రామగుండం, మంథని సీఐలు వేణుగోపాల్, చంద్రశేఖర్‌గౌడ్, సతీశ్, ఎన్టీపీసీ, వన్‌టౌన్ ఎస్ఐలు జీవన్, సమ్మయ్య, సుగుణాకర్, ట్రాఫిక్ ఎస్ఐ ఉదయ్, బసంత్‌నగర్ ఎస్ఐ వెంకటేశ్, కానిస్టేబుల్ సమ్మయ్య, తదితరులు ఉన్నారు.

***ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు***

విద్యా సంస్థల్లో ర్యాగింగ్ ఏ రూపంలో ఉన్న చట్టరీత్యా నేరమని, ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటామని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టీ శ్రీనివాస్ హెచ్చరించారు. పట్టణంలోని మార్కండేయకాలనీలో గల కృష్ణవేణి పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఇక్కడ పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడ చక్రపాణి, లోక్ అదాలత్ సభ్యుడు శంకర్, న్యాయసేవా సంస్థ వలంటీర్ సుజాత, న్యాయవాదులు, విద్యార్థులు ఉన్నారు.

## పూర్వ ప్రాథమిక విద్యతోనే మానసికాభివృద్ధి

జగిత్యాల రూరల్, డిసెంబర్16: పూర్వ ప్రాథమిక విద్యతోనే పిల్లల్లో సృజన్మాకత, మానసికాభివృద్ధి కలుగుతుందని ఐసీడీఎస్ రూరల్ సూపర్‌వైజర్ లావణ్య పేర్కొన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి అంగన్‌వాడీ కేంద్రం-2లో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు సంవత్సరాలు దాటిన పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందించడంతో పాటు ఆటపాటల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కొత్తవాడ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో సీడీపీవో వీరలక్ష్మి, సూపర్‌వైజర్ స్వరూపారాణి, అంగన్‌వాడీ టీచర్లు సంకోజు పద్మారాణి, రజిత, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

# మనకేదీ 'కాశీ' రైలు?

- తమిళ వాసుల కోసం ప్రత్యేకంగా 'కాశీ తమిళ సంఘం వీక్లీ ఎక్స్‌ప్రెస్'
- నేడు ప్రారంభించనున్న ప్రధాని ● ఆ రాష్ట్రంలో 18 చోట్ల హాల్టింగ్
- తెలంగాణలో మాత్రం మూడు చోట్లే ● 11 చోట్ల అవకాశమున్నా పట్టని కేంద్రం
- అన్ని చోట్లా ఆపాలని కోరుతున్న ప్రజలు ● 'కాశీ తెలుగు సంఘం' రైలు కేటాయించాలని డిమాండ్



పెద్దపల్లి, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : తమిళనాడు ప్రజల కోసం ప్రత్యేకంగా కన్యాకుమారి -బనారస్ మధ్య 'కాశీ తమిళ సంఘం' అనే వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను వేశారు. బనారస్ టూ కన్యాకుమారి (16368), కన్యాకుమారి టూ బనారస్ (16367) రైళ్లను నడుపనున్నారు. దీనిని ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తున్నారు. అయితే ఈ రైలుకు ఆ రాష్ట్రంలో 18 చోట్ల హాల్టింగ్ ఇచ్చారు. కానీ, కాశీతో ఎంతో అనుబంధమున్న మన రాష్ట్రంలో 11 చోట్ల అవకాశమున్నా కేవలం మూడు చోట్లే హాల్టింగ్ ఇచ్చారు. మధిర, డోర్నకల్, మహబూబాబాద్, కే సముద్రం, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లిలో ఆపే అవకాశమున్నా.. ఖమ్మం, వరంగల్, సిర్పూర్ కాగజ్‌నగర్ వద్ద మాత్రమే ఆపనున్నారు. నిజానికి తెలంగాణ నుంచి కాశీకి వెళ్లేందుకు రైళ్లు ఉన్నా.. ఇతర దూరపు రూట్లలో వెళ్లాల్సి వస్తున్నది. పెద్దపల్లి జంక్షన్ నుంచి చూస్తే.. వారణాసి, పాట్నాకు వెళ్లే రైళ్లు గ్రాండ్ ట్రంక్ మార్గమైన బల్లార్షా- సేవాగ్రామ్- నాగపూర్-ఇటార్సీ అటు నుంచి జబల్పూర్ మీదుగా చుట్టూ తిరుగుతూ అదనంగా 300 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తున్నది. అదే 'కాశీ తమిళ సంఘం' వీక్లీ ఎక్స్‌ప్రెస్ అయితే.. వారణాసి జంక్షన్‌కి అత్యంత దగ్గరి రైల్వే మార్గమైన బల్లార్షా- నగ్బిర్- గొండియా బాలఘాట్- నైన్‌పూర్- జబల్పూర్ మీదుగా వెళ్తే సుమారుగా 300 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. అలాగే తమిళనాడు రాష్ట్రంలోని మధురై, తంజావూరు, తిరుచ్చి, కన్యాకుమారి, తిరునల్వేలి పుణ్యక్షేత్రాలతోపాటు ఉత్తరాన ప్రయాగ, కాశీ పుణ్యక్షేత్రాలను నేరుగా దర్శించుకునే అవకాశం ఏర్పడుతుంది. ఇంత ప్రయోజనమున్న ఆ రైలును తెలంగాణకు ఎందుకు కేటాయించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. తమిళులకు చేరువవుతున్న కాశీ ప్రయాణం తమకెందుకు దూరమని ప్రశ్నిస్తున్నారు. ఎనిమిది చోట్ల హాల్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

**కాశీ దర్శనానికి కరుణించాలి..**

హిందువులు అత్యంత పవిత్రంగా కాశీ ప్రయాణాన్ని చూస్తారు. జీవితంలో ఒక్కసారైనా కాశీ వెళ్లాలని తాపత్రయ పడుతారు. ఇది ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో ఉంది. ఇక్కడ ప్రవహించే గంగానదిలో స్నానం ఆచరిస్తే సర్వపాపాలు నశిస్తాయని హిందువులు విశ్వసిస్తారు. హిందూ వివాహ వేడుకల్లో (ముఖ్యంగా బ్రాహ్మణ సామాజిక వర్గంలో) కాశీ యాత్ర అనేది తప్పనిసరిగా ఉంటుంది. కాశీ మన తెలంగాణ ప్రజలకు ఎంతో ముఖ్యమైనది. ఈ నగరంతో మన రాష్ట్ర ప్రజలకు అనుబంధం విడదీయరానిది. పితృ కార్యాలకు తప్పనిసరిగా కాశీ నగరానికి వెళ్తుంటారు. చనిపోయిన వారి అస్థికలను, చితా భస్మాన్ని కాశీ గంగానదిలో కలుపుతారు. కాశీ నుంచి తెచ్చిన గంగా జలాన్ని రామేశ్వరంలోని సముద్రంలో కలుపుతారు. అలాగే రామేశ్వరం నుంచి తీసుకువచ్చిన ఇసుకను కాశీ గంగలో కలుపుతారు. ఈ సంప్రదాయం గత శతాబ్దాలుగా కొనసాగుతూ వస్తున్నది. అయితే కాశీ నగరంతో ఇంత అనుబంధమున్న మన రాష్ట్రానికి 'కాశీ తమిళ సంఘం' అనే ఎక్స్ ప్రెస్ రైలు మాదిరిగా 'కాశీ తెలంగాణ సంఘం' అనే పేరిట ఎక్స్ ప్రెస్ రైలుని ప్రారంభించాలని మన ప్రజలు కోరుతున్నారు. ఈ రైలు కోసం తెలంగాణలోని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, ఇతర ఎంపీలు కృషి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## జీరో టిల్లేజ్ మక్క సాగుతో మేలు

ముకరంపుర, డిసెంబర్ 16: జీరో టిల్లేజ్ విధానంలో మక్క సాగు చేయడం రైతులకు లాభదాయకమని వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జీ మంజులత సూచించారు. అఖిల భారత మక్క పరిశోధన కేంద్రం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా షెడ్యూల్ కులాల ఉపప్రణాళికలో భాగంగా శనివారం వ్యవసాయ పరిశోధనా స్థానంలో జీరో టిల్లేజ్ మక్కసాగులో మెళకువలు- వ్యవసాయ ఉత్పాదకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త జీ మంజులత మాట్లాడుతూ, జీరో టిల్లేజ్ మక్క సాగుచేసే విధానాన్ని, ప్రయోజనాలను రైతులకు వివరించారు. వ్యవసాయాధికారి అంజనీ మాట్లాడుతూ, మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడి సాధించాలని, పురుగు మందులు పరిమితంగా వాడాలన్నారు. పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు యాసంగి మక్క రకాలు, విత్తనోత్పత్తి, ఎరువులు, కలుపు, నీటి యాజమాన్యం, చీడ పీడల యాజమాన్యంపై అవగాహన కల్పించారు.



రైతులకు మక్క విత్తనాలు, టార్పాలిన్లు ఇస్తున్న పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త మంజుల, శాస్త్రవేత్తలు

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం జయప్రకాశ్

మంథని రూరల్, డిసెంబర్ 16: సైబర్ నేరాలపై బ్యాంకు ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని నాబార్డు డీడీఎం జయప్రకాశ్ పేర్కొన్నారు. మంథని కేడీసీసీ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత-నగదు రహిత లావాదేవీలపై మండలంలోని నాగేపల్లి, అడవిసోమన్‌పల్లి, మల్లారం, ఆరెంద గ్రామాల్లో శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా నాబార్డు డీడీఎం జయప్రకాశ్ మాట్లాడారు. ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు పెరిగి పోతున్నందున ఏటీఎం పిన్ నంబర్లు, ఓటీపీ, పాస్‌వర్డ్‌ను ఇతరులకు చెప్పవద్దన్నారు. ఏటీఎం కార్డు పిన్ నంబర్లు తరుచుగా మార్చుకోవాలన్నారు. కేడీసీసీ బ్యాంక్ మంథని మేనేజర్ దుమ్మని లక్ష్మణ్ మాట్లాడుతూ, నగదు రహిత లావాదేవీలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సహకార సంఘం, బ్యాంకులో క్రాప్ లోన్ కలిగిన ప్రతిఒక్కరూ కేసీసీ కార్డులు పొందాలన్నారు. సహకార బ్యాంక్ ద్వారా పాడి పశువులు, గొర్రెలు, పండ్లు, ఆయిల్‌ఫాం తోటల పెంపకం, పాలీహౌజ్‌లు, పవర్ టిల్లర్స్, గోదాంలకు, ట్రాక్టర్స్, హర్వెస్టర్లు, గోల్డ్ లోన్లు, స్వయం సహాయక సంఘాలకు, గృహ నిర్మాణాలు, కొనుగోళ్లు, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులకు వ్యక్తిగత, విదేశీ విద్యా, మార్టిగేజ్, ఎస్‌హెచ్‌జీ, జేఎల్‌జీ, ఇళ్ల రిపేరుకు, ఇంటీరియర్ డెకరేషను, పీఎంఈజీపీ, కార్పొరేషన్ రుణాలు అందిస్తున్నామన్నారు. అలాగే ఖాతాదారులకు ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు డీఈ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

## మల్లాపూర్‌లో దొంగల బీభత్సం

- అర్ధరాత్రి నాలుగు ఇండ్లలో చోరీ
- నాలుగు తులాల బంగారం, రెండు కిలోల వెండి, ₹50 వేల నగదు అపహరణ

మల్లాపూర్, డిసెంబర్ 16: మల్లాపూర్ మండల కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో నాలుగు ఇండ్లతోపాటు, అంగన్‌వాడీ కేంద్రంలో తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గొర్రెపల్లి బైపాస్ రోడ్డుకు అనుకొని ఉన్న ఎస్సీ కాలనీలో బూరం అరవింద్, మాతె విమలకు సంబంధించిన ఇండ్లు, మరో రెండు ఇండ్లకు తాళం వేసి ఉంది. ఈ క్రమంలో దొంగలు తాళాలు కట్ చేసి, బీరువాలను ధ్వంసం చేశారు. ఆయా చోట్ల నాలుగు తులాల బంగారం, రెండు కిలోల వెండి, ₹50 వేల నగదును అపహరించికెళ్లినట్లు తెలిపారు. ఇల్లే కాదు ఓ అంగన్‌వాడీ కేంద్రలోనూ చోరీకి పాల్పడ్డారు. అయితే ఉదయాన్నే ఇండ్ల తాళాలు కట్ చేసి ఉండడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ నవీన్‌కుమార్, క్లూస్ టీం సభ్యులతో కలిసి చోరీకి గురైన ఇండ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఇండ్లను పరిశీలిస్తున్న మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ నవీన్‌కుమార్